సంక్షేమ పథకాలే ప్రభుత్వానికి శ్రీరామరక్ష

ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: సంక్షేమ పథకాలే రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీరామ రక్ష అని ప్రభుత్వ చీఫ్ విప్, శాసన మండలి సభ్యులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. తన సొంత గ్రామమైన కొండుబొట్లవారిపాలెం ఎస్సీ కాలనీలో ఆదివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లక్షలాది ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజా ప్రతినిధులు గడప గడపకు ధైర్యంగా వెళ్తున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను తిరిగి అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామంలో ప్రజా సమస్యలను, సంక్షేమ పథకాలు అందుతున్న తీరు తెన్నులను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

అర్హత ఉన్నత ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. సాంకేతికపరమైన లోపాలు గుర్తించి మళ్లీ లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల ప్లాట్‌లలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను తొందరగా చేపట్టాలని కోరారు. రానున్నది జగనన్న ప్రభుత్వమని.. ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి ఓటు వేసి మరలా ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, వడ్డీముక్కల డేవిడ్, పీటా వేణుగోపాల్, గవిని కృష్ణమూర్తి, కాగిత సుధీర్‌బాబు, ఆట్ల ప్రసాద్ రెడ్డి, రూరల్ ఎస్సై వెంకటప్రసాద్, ఈఓపీఆర్డీ శరత్‌బాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

బాపట్ల అర్బన్: మాఘ పౌర్ణమి సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఉదయం శాంతి హోమం, ఆలయ గోశాలలో గోమాతకు నామకరణ మహోత్సవం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. 50 మంది దంపతులతో శ్రీనివాస కల్యాణం, సాయంత్రం గరుడోత్సవం నిర్వహించారు. శ్రీనివాస సేవా సమితి ఆలయ ధర్మకర్త ఉడతల సుబ్రహ్మణ్యం, సుదర్శనం చక్రవర్తి, యజ్ఞాన స్వాములు పరాశరం రామాచార్యులు, గంజాం ప్రసాదా చార్యులు, దీవి పవన్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. తీర్థ ప్రసాదాలు భక్తులు అందించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

చీరల పంపిణీ



మహిళలకు చీరలు అందజేస్తున్న ఎస్ఐ రహీంరెడ్డి

కర్లపాలెం: పేదలకు చేయూతనివ్వటం సంతోషాన్ని కలిగిస్తోందని నెల్లూరు జిల్లా దుర్గామిట్ట ఎస్ఐ కోటా రహీంరెడ్డి పేర్కొన్నారు. కర్లపాలెం పంచాయతీ రాజీవ్‌నగర్ గ్రామంలోని యెరూషలేము మందిరంలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వృద్ధులు, వితంతువులు 50 మందికి చీరలు పంపిణీ చేశారు. రహీంరెడ్డి మాట్లాడుతూ భగవంతుడు ప్రతి మంచి పనిలో ఉంటాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ షడ్రక్ ఉన్నారు.

బండ్లమ్మకు వైభవంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో బండ్లమ్మవారు

చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలులో వేంచేసిన శ్రీ బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు చేశారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ మాఘమాసం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఈఓ జి.నరసింహమూర్తి, అర్చకులు కుంచల బళ్ళారెడ్డి, నరసారెడ్డి తదితరులు ఉన్నారు.

పేదలకు బియ్యం, దుప్పట్లు పంపిణీ

రేపల్లె రూరల్: మండలంలోని బేతపూడి కాలువకట్టల వద్ద నివశిస్తున్న 26 మంది ఎస్టీలకు తెనాలికి చెందిన ట్రైబల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దుప్పట్లు, బియ్యం ఆదివారం పంపిణీ చేశారు. ట్రస్ట్ అధినేత రావూరి అంజలి, డైరెక్టర్ రావూరి సురేష్‌బాబు పాల్గొన్నారు.

నేటి నుంచి పెదలంకలో హోమాలు



శ్రీ పృథ్వీశ్వర స్వామి

పెదలంక(భట్టిప్రోలు): మండలంలోని పెదలంక గ్రామంలో గంగా పార్వతి సమేత పృథ్వీశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం నుంచి 8వ తేదీ వరకు మహా గణపతి, మహా చండీ, మహా రుద్ర హోమాలు జరుగుతాయని పృథ్వీశ్వర స్వామి భక్త సమాజం కన్వీనర్ వీవీ సురేంద్ర ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహా గణపతి హోమం, మంగళవారం మహా చండీ హోమం, బుధవారం మహా రుద్ర హోమం జరుగుతుందని ఆయన చెప్పారు.

అమరవీరుల త్యాగాలు ఎనలేనివి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరావు

రేపల్లె: కష్టజీవుల కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన అమర వీరులను గుర్తు చేసుకోవడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యతని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) ఆధ్వర్యాన నెహ్రూబొమ్మ సెంటర్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన రేపల్లె తాలూకా అమరవీరుల స్మారక సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమాలలో పోరాటాల పురిటిగడ్డ పాత రేపల్లె తాలూకా ఉద్యమం కీలకమైన పాత్ర పోషించిందన్నారు. ప్రజల కోసం పోలీస్ కాల్పుల్లో మరణించిన అమర వీరులు దాసరి సుబ్బయ్య, మోటూరు వెంకటరత్నం, గుమ్మడి సీతారామయ్య, కంఠంనేని వెంకటరత్నం, కస్తూరి కుటుంబరావు, ముత్తిరెడ్డి వెంకటాచలం, మండవ కోటేశ్వరరావు త్యాగాలను గుర్తుచేశారు. తొలుత అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.రమాదేవి, బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్, సీపీఎం పట్టణ అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ తదితరులు పాల్గొన్నారు.

శాకాహారంతో ఆరోగ్యం పదిలం



కర్లపాలెంలో శాకాహారంపై అవగాహన ర్యాలీ

కర్లపాలెం: శాకాహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని పిరమిడ్ ధ్యాన కేంద్రం జిల్లా సేవాదల్ కన్వీనర్ ఆకురాతి శంకర్‌రావు పేర్కొన్నారు. కర్లపాలెంలోని శ్రీగురువాణి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం ధ్యాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శాకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీవకోటి రక్షణే మానవాళికి రక్ష అని.. సంపూర్ణ ఆరోగ్యమే ప్రగతికి సోపానమని ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధ్యాన కేంద్రం యజమాని కూనం చంద్రశేఖర్, లీలావతి, మాధవ వర్మరాజు, శివవర్మరాజు, వెంకట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

అమర్తలూరు: ఎన్టీఆర్ సేవా సమితి తరుపున వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు మైనేని రత్న ప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం కొత్తపల్లి సుబ్బయ్య, కోటయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారంతో 50 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తి కొండ శాంతకుమారి, మైనేని బాలావణి, నాదెళ్ల నర్మద, వెనిగళ్ల ప్రదీప్, వెనిగళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి అఖండ ప్రజ్వలన ప్రారంభం

పెదపులివర్రు(భట్టిప్రోలు): మండలంలోని పెదపులివర్రులో శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో లోక కల్యాణార్థం 108 నామాల అఖండ జ్యోతుల మహా యజ్ఞంలో భాగంగా ఈ నెల 9వ తేదీ నుంచి అఖండ ప్రజ్వలన ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు గొర్రిపాటి హరిబాబు, బాల త్రిపుర సుందరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ షిర్డీ సాయిబాబా జీవిత సచ్చరిత్ర పారాయణం 49 రోజుల పాటు జరుగుతుందని పేర్కొన్నారు. రాంజీ బాబా సారథ్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. మార్చి 30వ తేదీన పూర్ణాహుతితో కార్యక్రమం ముగుస్తుందని పేర్కొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

రేపల్లె: అభయ ఫౌండేషన్ సహకారంతో షారోనా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ తరగతులు నిర్వహించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు షారోనా సొసైటీ ఫౌండర్ దాసరి భరణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు జేఎల్‌బీ కళాశాల రోడ్డులోని తమ షారోనా వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు. రేషన్‌కార్డు, ఆధార్ జిరాక్స్‌లతో పాటు రెండు ఫొటోలతో దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 81257 60617 నంబరుకు సంప్రదించాలని వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సబ్సిడీపై కుట్టు మిషన్ అందించటంతో పాటు సర్టిఫికెట్‌లు ఇవ్వనున్నట్లు చెప్పారు.

ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యల పరిష్కారం

బీసీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు ఎనుముల భాస్కర్‌గౌడ్

బాపట్లటౌన్: ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని బీసీ సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎనుముల భాస్కర్ గౌడ్ పేర్కొన్నారు. పట్టణంలోని విశ్వబ్రాహ్మణ కాలనీలో ఆదివారం నియోజకవర్గంలోని బీసీ సంఘాల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నియోజకవర్గంలోని బీసీల సంఘాల ఆధ్వర్యంలో బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సభకు ఎమ్మెల్యే కోన రఘుపతి హాజరవుతారని తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలో బీసీ భవనం ఏర్పాటు చేసుకొని బీసీలంతా ఐక్యమత్యంగా మెలగాలన్నారు. సమావేశంలో జేఏసీ జనరల్ సెక్రటరీ కొల్లూరి వెంకట్రావు, ట్రెజరరీ చల్లా రామయ్య, వైస్ ప్రెసిడెంట్ గండికోట సుబ్బయ్య, జాయింట్ సెక్రెటరీ మారం రవికుమార్, పసుపులేటి అశ్వనీకుమార్, ఆర్గనైజర్ సెక్రెటరీ ఉప్పాల మురళీ, ఎస్.వలి, సలహా సంఘం తోటా నాగేశ్వరరావు, టీవీ రమణయ్య, పిన్నిబోయిన వెంకటేశ్వరరావు, కేవీ సుబ్బయ్యచారి, తాడిశెట్టి రామకోటయ్య, దాసరి నరసింహారావు పాల్గొన్నారు.

ముగిసిన మల్లికార్జున స్వామి తిరునాళ్ల



ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ మోపిదేవి

నిజాంపట్నం: శ్రీ భ్రమరీ బాల త్రిపుర సుందరి సహిత శ్రీ మల్లికార్జునేశ్వర స్వామి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని అడవుల దీవిలో వేంచేసిన మల్లిఖార్జునేశ్వర స్వామి తిరునాళ్ల మహోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఆలయ నిర్వాహకులు ఎంపీ మోపిదేవిని పట్టువస్త్రాలు సమర్పించి, సత్కరించారు. ఆలయ నిర్వాహకులు యల్లాప్రగడ సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు యార్లగడ్డ మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో.. మినుము సాగు బాగు..!



మినుము పైరుకు మందు పిచికారి చేస్తున్న రైతు



బూడిద తెగులు ఆనవాళ్లు

తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం

పిట్టలవానిపాలెం: ఖరీఫ్ వరి తర్వాత రైతులకు అధిక ఆదాయాన్ని అందించే పంట మినుము. అయితే పేనుబంక, తెల్లదోమ, తామర పురుగులు వ్యాప్తి చెంది పంటను నాశనం చేస్తున్నాయి. దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. చీడపీడలను సకాలంలో గుర్తించి, నివారణ చర్యలు చేపడితే రైతులకు పంట గిట్టుబాటవుతుందని బాపట్ల ఏడీఏ లక్ష్మి తెలిపారు. పంటను ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలను ఆమె వివరించారు.

పేనుబంక పురుగు:

తల్లి, పిల్ల పురుగులు ఆకు అడుగు బాగాన చేరి రసం పీల్చుతాయి. దీనివల్ల ఆకులు వడలినట్లుండి మెలితిరిగి వంకరలు పోతాయి. ఈ పురుగు స్రవించే తేనె వంటి జిగురు పదార్థం ఆకుల మీద ఉండి నల్లటి శిలీంధ్రాల పెరుగుదలకు అవకాశం ఏర్పడుతుంది. నివారణకు.. నత్రజని ఎరువులు తగినంత మోతాదులో వాడడం వల్ల ఈ పురుగు ఉధృతిని కొంత వరకు నియంత్రించవచ్చు. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు మిథైల్ డెమటాన్ 200 మిల్లీ లీటర్లు లేదా మోనోక్రొటోఫాస్ 300 మిల్లీ లీటర్లు మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా విస్తీర్ణానికి పిచికారి చేయాలి.

తామర పురుగులు:

ఈ పురుగులు ఆకులు, పూల కొమ్మల నుంచి రసం పీల్చుతాయి. దీనివల్ల మొక్కలు గిడసబారి ఎదుగుదల కోల్పోతాయి. పూత క్రమంగా రాకపోవడంతో దిగుబడిపై ప్రభావం చూపుతుంది. నివారణకు.. నిర్దేశిత మోతాదులో నత్రజని ఎరువులు వాడాలి. ఎసిఫేట్ 200 గ్రాములు లేదా మోనోక్రొటోఫాస్ 300 ఎంఎల్ 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా విస్తీర్ణంలో పిచికారి చేయాలి.

తెల్లదోమ:

మినుము తొలి దశలోనే ఈ దోమ తల్లి, పిల్ల పురుగులు కాండం వద్ద చేరి రసం పీల్చుతాయి. దీనివల్ల మొక్క ఎదుగుదల తగ్గిపోతుంది. నివారణ ఇలా.. పొలంలో మిత్ర పురుగులను రక్షించాలి. పసుపు రంగు డబ్బాలను పొలంలో ఉంచి ముందుగా పురుగు ఉధృతిని గుర్తించాలి. పురుగు అధికంగా ఉన్నప్పుడు క్వినాల్ ఫాస్ 25సీసీ 300 ఎంఎల్ లేదా ట్రై అజోఫాస్ 400 ఎంఎల్ 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పైరుకు పిచికారి చేయాలి.

కాండపు ఈగ:

ఈ పురుగు క్రిమి దశలో ఉన్నప్పుడు కాండంలో చేరి తినడం వల్ల మొక్క ఎండిపోతుంది. రబీలో ఉధృతి తక్కువ. దీని నివారణకు పొలంలో కలుపు లేకుండా చూడాలి. మోనోక్రొటోఫాస్ 300 ఎంఎల్ లేదా ఎసిఫేట్ 200 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా విస్తీర్ణానికి పిచికారి చేయాలి.

పొగాకు లద్దె పురుగు:

ఈ పురుగు ముదరు గోధుమ నుంచి ముదురు బూడిద రంగులో ఉండి ఆకులలోని పచ్చని పదార్థాన్ని తినేయడం వల్ల ఆకులు తెల్లగా మారతాయి. ఆకులను రంధ్రాలుగా చేసి తినేస్తాయి. ఆకులు జల్లెడలా మారతాయి. పూత, పిందెలను కూడా తింటాయి. ఈ పురుగు రాత్రి పూట మొక్కలను తినేస్తాయి. పగటి పూట మొక్కల కాండం వద్ద గల మొదళ్లు భూమి నెర్రెలలోకి చేరతాయి. నివారణ కోసం.. ముందుగా గుడ్ల సముదాయాలను, జల్లెడగా మారి పిల్ల పురుగులతో ఉన్న ఆకులను ఏరివేసి నాశనం చేయాలి. పురుగు ఉధృతి అధికంగా ఉంటే ఎకరాకు మోనోక్రొటోఫాస్ 500 ఎంఎల్ లేదా క్లోరిపైరిఫాస్ 500 ఎంఎల్ మందును 5 కిలోల తవుడు, అరకిలో బెల్లం సరిపడే నీటిలో కలిపి ఉండలుగా చేసి సాయంత్రం సమయంలో జల్లాలి.

మరుకా మచ్చల పురుగు:

ఈ పురుగు తల్లి పురుగు ఆకుల చివర, పువ్వుల మొదలు వద్ద గుడ్లు పెడుతుంది. కాయలలో గూడులను ఏర్పాటు చేసి తినేస్తుంది. క్లోరిపైరిఫాస్ 500 ఎంఎల్, క్వినాల్‌ఫాస్ 400 ఎంఎల్‌తో పాటు డైక్లోరోవాస్ 200 ఎంఎల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారి చేయాలి.

బాపట్లలో యజ్ఞం హాస్పిటల్ ప్రారంభం



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణం సూర్యలంక రోడ్‌లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో నిర్మించిన యజ్ఞం హాస్పిటల్‌ను శాసన సభ్యుడు కోన రఘుపతి ఆదివారం ప్రారంభించారు. జనరల్ మెడిసిన్ ఎండీ డాక్టర్ బెల్లంకొండ యజ్ఞ శ్రీకాంత్, మహిళల వైద్య నిపుణులు డాక్టర్ మాధవి హాస్పిటల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో గుంటూరు, విజయవాడ నగరాలకు ఇక నుంచి వెళ్లవలసిన అవసరం ఉండదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి, డాక్టర్ మౌలాలి, డీఎస్పీ శ్రీనివాసరావు, చేజర్ల నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

గడపగడపకు కార్యక్రమంలో మంత్రి నాగార్జున



మహిళతో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

వేమూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ నివాస స్థలంతో పాటు ఇల్లు నిర్మించి సొంతంటి కల సాకారం చేశామని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండలంలోని మోపర్రు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేమూరు నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామని తెలిపారు. మోపర్రు గ్రామంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, సర్పంచ్ కొండపల్లి కిరణ్ కుమార్, పార్టీ నాయకులు మోదుకూరి హరిబాబు, కొండపల్లి వినయ్, కొత్తపల్లి శేషయ్య, షేక్ వలీ, కాకర్లమూడి భాస్కర్, కాకిత సందీప్, కొండపల్లి వెంకట్, చక్రవరం గోవిందరాజు, గర్నిపూడి అజయ్, జె.రామకృష్ణ, మామిడిపల్లి బాలు, గోవతోటి ఏసోబు, మోదుకూరి ముత్యాలు, కొండపల్లి కొర్నియేలు, సోమిశెట్టి నాంచారయ్య, జాలాది కిష్టయ్య, చిక్కాలా ఏసురత్నం, చల్లపల్లి అనిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన బూరుగులమ్మ తిరునాళ్ల



ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె: మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న పట్టణ గ్రామ దేవత శ్రీ బూరుగులమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు నంది వెలుగు భాను సుధాకర్ గురుకులు ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం నుంచి సహస్రనామ కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి సద్ది నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం ఆలయ ఆవరణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, కౌన్సిలర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోళ్లగుంటలో...

మండలంలోని మోళ్లగుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామదేవత నాంచారమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారిని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పీతా వెంకటేశ్వరరావు, సర్పంచ్ రేవు నాంచారమ్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి శాంతి కల్యాణం



చెన్నకేశవ స్వామి శాంతి కల్యాణంలో పాల్గొన్న దంపతులు

వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో మాఘ పౌర్ణమి పురస్కరించుకుని ఆదివారం శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణంలో నంబూరు నాగభూషణరావు, కృష్ణకుమారి దంపతులు పాల్గొన్నారు. వైఖానస పండితులు విజయాచార్యులు, మారుతీ సత్యసాయి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఈఓ దీవి వెంకట అప్పలాచార్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వెల్లటూరు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జోన్ చైర్మన్ కుర్రాళ్ల రవి కుమార్ పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాగళ్ల ఆంజనేయులు, నిర్వాహకులు నంబూరు పవన్, నంబూరు ప్రసాద్, గోలి చంద్రయ్య, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ నంబూరు తేజ, సుగ్గుల మధు, కుర్రాళ్ల మాధవ, నంబూరు నరేంద్ర, నంబూరు కిషోర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో ఉచిత వైద్య శిబిరం



భట్టిప్రోలు పంచాయతీకి మార్చురీ బాక్సును అందజేస్తున్న బీఎఫ్ఏ సభ్యులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్(బీఎఫ్ఏ) ఆధ్వర్యాన స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరాన్ని మణిపాల్ హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఇమ్మానియేల్ ప్రారంభించారు. మణిపాల్ హాస్పిటల్(విజయవాడ) సహకారంతో క్యాన్సర్, గుండెకు సంబంధించి ప్రత్యేక వాహనంలో ఉచితంగా పరీక్షలు జరిపారు. డాక్టర్ మహ్మద్ అస్లాం, ఇమ్మానియేల్‌తో పాటు, మూల్పూరు పీహెచ్‌సీ వైద్యులు ఆకురాతి శ్రీనివాసరావు, దంత వైద్య నిపుణురాలు కొన్నిపాటి రోజా వైద్య పరీక్షలు నిర్వహిచారు. 450 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. కొన్నిపాటి చిన పరదేశి, సూర్యకాంతమ్మ జ్ఞాపకార్థం అద్దేపల్లికి చెందిన బీఎఫ్ఏ నిర్వాహకులు కొన్నిపాటి సత్యసాయి రూ.70 వేలు విలువ చేసే మార్చురీ బాక్సును సర్పంచ్ దారా రవి కిరణ్మయికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎఫ్ఏ నిర్వాహకులు దొంతు ఆదినారాయణ, షేక్ మస్తాన్(యాసిన్), కొన్నిపాటి సత్యన్నారాయణ, కొసన శ్రీనాథ్, బొలిశెట్టి జయబాబు, డాక్టర్ అనల ద్వారకానాథ్, బుర్లె కిరణ్‌కుమార్, భారతుల శ్రీధర్, శైలజ, వంగర బాబూజీ, పసుపులేటి శివరామ ప్రసాద్, బొలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వాముల కల్యాణం



పూజలందుకున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి

చింతాయపాలెం(కర్లపాలెం): శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామి శాంతి కల్యాణం ఆదివారం రాత్రి కనుల పండువగా జరిగింది. చింతాయపాలెం పంచాయతీ తూర్పుపాలెం గ్రామంలో వేంచేసిన లక్ష్మీ తిరుతమ్మ గోపయ్య స్వాముల ఆలయంలో కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వాముల ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృత, శ్రీ చందన సుగంధ ద్రవ్య అభిషేకాలు నిర్వహించారు. పుష్పార్చనలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజారులు స్వామివారి ఉత్సవ విగ్రహాలకు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మండల పరిధిలోని అమ్మవారి భక్తులు వేలాదిగా తరలివచ్చి కల్యాణోత్సవంలో పాల్గొని, స్వామివార్లను దర్శించుకున్నారు. పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి ప్రభను, ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

నేడు సర్వసభ్య సమావేశం

అమర్తలూరు(వేమూరు): మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ రాపర్ల నరేంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావలని పేర్కొన్నారు.